# అమెరికా బుజ్జిపండు

– జ్యోతిర్మయి



## బుజ్జిపండు ఇండియా టూర్!

**బుజ్జిపండు అమెరికాలో పుట్టి పెరుగుతున్న తెలుగు కుర్రాడు. వాడి బుజ్జిపొట్టలో ఎప్పుడూ ఎన్నో సందేహాలు. తెలుగుతనం కాపాడుకోవాలనుకునే అమ్మా, నాన్నా - బయట ఎక్కడి కెళ్ళినా వివిధ జాతుల పిల్లలతో సహవాసం, మధ్య మధ్యలో సంస్కృతీ సంప్రదాయం అంటూ అమ్మా నాన్నలు తీసుకెళ్ళే కార్యక్రమాలూ.. వెరసి వాడికి అన్నీ అనుభవాలే, అన్నీ వింతలూ విడ్డురాలే! అలాంటి అమెరికా బుజ్జిపండు అనుభవాలు నెలకొకటి మీకోసం!**

పండు, భారత దేశంలో వున్న వాళ్ళమ్మమ్మ వాళ్ళింటికి వెళ్ళి వారం అయింది. పోయినసారి వెళ్ళినప్పుడు బాగా చిన్నవాడు. బహుశ వాడికప్పుడు రెండేళ్ళు ఉంటాయేమో! వాడికి ఉహ తెలిశాక ఇప్పుడే వెళ్ళడం. పండు, వాళ్ళ అమ్మ, అక్క అందరూ కలిసే వెళ్ళారు, వాళ్ళ నాన్న మాత్రం ఓ నెల తరువాత వెళ్తాడు.

పండు వాళ్ళమ్మమ్మ వాళ్ళది ఒక మోస్తరి పట్టణం. ఇంటి చుట్టూ నిశ్శబ్దంగా ఉండే పరిసరాల నుండి వచ్చాడేమో, వాళ్ళమమ్మ వాళ్ళ వీధిలో నుండి లోపలి గదుల వరకూ వినిపించే రకరకాల వాహనాల శబ్దాలు, పక్షుల అరుపులు, కూరగాయలు అమ్మేవాళ్ళ పిలుపులు, కారు హారన్ లు వాడికి చాలా నచ్చేశాయి. నిద్ర లేవగానే ఇంటి ముందున్న పోర్టికోలో నిలబడి ఆసక్తిగా ఆ వీధిలో వెళ్ళే వాటిని చూడడం ప్రస్తుతం వాడి దినచర్యలో ముఖ్యమైన భాగం. ఇవాళ కూడా అలాగే బాల్కనీలో నిలబడి కొబ్బరి ఆకుల మధ్య కిలకిలలాడుతున్న పక్షుల జంటను వెతుకుతుండగా ఎవరో వస్తున్నట్లనిపించి గేటు వైపు చూసాడు. ఓ వయసు మళ్ళిన వ్యక్తి, భుజానికి గుడ్డ సంచి తగిలించుకుని కర్ర సాయంతో నడుస్తూ గేటు వైపు వస్తున్నాడు. చిరుగుల చొక్కా, మురికి పట్టిన నీరుకావి పంచె అతని

వంటిమీద వదులుగా వేలాడుతూ ఉన్నాయి. నిన్న సాయంత్రం అలాంటి అతనే గుడి దగ్గర కనిపిస్తే పండు వాళ్ళమ్మ వైష్ణవి అతనికి పది రూపాయలిచ్చింది.

"అమ్మమ్మా బెగ్గర్ గారు వచ్చారు" ఇంట్లోకి చూస్తూ గట్టిగా కేక పెట్టాడు పండు. లోపలనుండి అమ్మ, అమ్మమ్మల నవ్వులు వినిపించాయి. చెట్ల దగ్గర కింద పడిన ఆకులు ఊడిచి శుభ్రం చేస్తున్న లక్ష్మి పడీపడీ నవ్వింది. పండుకు బోలెడు కోపం వచ్చింది. ఏం మాట్లాడినా అలా గట్టిగా నవ్వేస్తుంటే ఎవరికి మాత్రం కోపం రాదు. వాళ్ళెందుకు నవ్వేరో వాడికసలు అర్థం కాలేదు కూడా. మొన్నో రోజు వాడు, వాళ్ళక్క ప్రత్యూష ఇంటి ముందు రాలిన వేపకాయలను చిన్న పుల్లలకు తగిలించి దూరంగా విసిరేస్తూ ఆడుకుంటున్నారు. ఇంతలో ఓ పెద్దాయన వచ్చి

"మీ తాతయ్య ఇంట్లో ఉన్నాడా?" అని అడిగాడు.

"లేడు. బజార్ కి వెళ్ళాడు" సమాధానమిచ్చాడు పండు.

"మీ తాతయ్య వచ్చాక నీ కోసం రమణయ్య వచ్చాడని చెప్పు" అని చెప్పి ఆ పెద్దమనిషి వెళ్ళిపోయాడు.

ఆ మధ్యాహ్నం తాతయ్య ఇంటికి రాగానే టివి చూస్తూ గూడా గుర్తుపెట్టుకుని "నీకోసం రమణయ్య వచ్చాడు తాతయ్యా" అని చెప్పాడు పండు.

"పండూ, పెద్దవాళ్ళను అలా పేరు పెట్టి పిలవకూడదు. ఏదో ఒక వరుసతోనో, గారు అనో అనాలి. అలాగే వచ్చారు అనాలి, వచ్చాడు అనకూడదు." సరి చేసింది వైష్ణవి.

అది గుర్తొచ్చే ఇవాళ బెగ్గర్ గారు అంటే వాళ్ళంతా ఒకటే నవ్వడం. అసలు గారు అనాలా వద్దా అని ఆలోచిస్తుండగా వీధిలో "తాటి ముంజెలో..." అని అరుస్తూ ఒకామె గంప నెత్తిన పెట్టుకుని వెళ్తోంది. అమ్మమ్మ హడావిడిగా బయటకు వచ్చి ఓ తాటి ముంజెలమ్మాయ్ ఇట్రా" అని పిలుస్తూ గేటు తీసింది. ఆవిడ వచ్చి గంప కిందకు దింపగానే తాటాకుల మధ్య వున్న ముంజెల వైపు చూస్తూ

"లేతవేనా?" అని అడిగింది.

"లేతయ్యేనమ్మా, తీపుముంజెలు" అంటూ ఒకటి తీసి అమ్మమ్మకిచ్చింది.

అమ్మమ్మ కొంచెం తుంచి పండుకు, ప్రత్యూషకు చెరో ముక్క పెట్టి, తానోముక్క తీసుకుంది. ఆమె చెప్పినట్లు చాలా తియ్యగా ఉన్నాయవి.

"ఎంతకిస్తావు?" అడిగిందమ్మమ్మ.

"పది రూపాయలకు నాలుగమ్మా"

"పదికి ఏడివ్వు"

"గిట్టదమ్మా"

"ఎందుకు గిట్టదు, నిన్న కూడా పదికి ఏడు లెక్కన తీసుకున్నాం"

"ఇయ్యి కొండాపురం ముంజెలమ్మా, లేత కొబ్బరిలాగుంటాయి. ఐదు చేసి తీసుకోండి"

"సరేలే ఆరివ్వు. ఇంక బేరం లేదు." అని అమ్మనడిగి గిన్నె తీసుకురమ్మని పండుకు పురమాయించింది.

పెరట్లో వున్న అమ్మ దగ్గరకి వెళ్లి పండు "అమ్మ నీ అమ్మ గిన్నె తీసుకురమ్మంది" అని చెప్పగానే, వైష్ణవి, బట్టలుతుకున్న లక్ష్మి గట్టిగా నవ్వేశారు. గిన్నె తీసుకెళ్ళే హడావిడిలో వాళ్ళ నవ్వుల్ని వాడు పెద్దగా పట్టించుకోలేదు.

ఆ సాయంత్రం దీపాలు పెట్టేవేళ తాతయ్య గేటు తీయడం చూసి "అమ్మమ్మా మీ నాన్న వస్తున్నాడు" అంటూ పరిగెత్తుకుంటూ లోపలకు వచ్చాడు పండు. మా నాన్న చనిపోయి పదేళ్ళు అవుతోంది. ఇప్పుడు రావడం ఏమిట్రా, పైగా ఆయన్ను నువ్వు చూడను కూడా లేదు అంటూ ఆశ్చర్యంగా ముందు గదిలోకి వచ్చింది అమ్మమ్మ.

"ఆరి భడవా మీ తాతయ్యను పట్టుకుని మా నాన్న అంటావే" అని బోలెడు ఆశ్చర్యపోయింది.

"ఆయన మా నాన్న పండూ, అమ్మమ్మ వాళ్ళ నాన్న కాదు" వివరించింది వైష్ణవి.

"మరి ఆయన అమ్మమ్మకు ఏమవుతాడు?"

"హస్బెండ్ అవుతాడు"

"అయితే ఈసారి నుండి "అమ్మామ్మా నీ హస్బెండ్ వచ్చాడు, అని చెప్తాలే" అని వాళ్ళ అక్క పిలిస్తే పరిగెత్తుకుంటూ పక్కగదిలోకి వెళ్ళిపోయాడు.

కూరగాయలు తెచ్చే ఆమెను పెద్దమ్మగారు అని, ఆటో అతన్ని ఆటో మామయ్య అని ఇలా అందర్నీ నానా రకాల పేర్లతో పిలిచి ఇంట్లో వాళ్ళను తెగ నవ్వించేస్తున్నాడు పండు. వాళ్ళ నవ్వులకు మొదట్లో కొంచెం ఉక్రోషపడినా తరువాత వాడికి అది సరదాగానే వుంది.

* * * * * *

ఓ నెల తరువాత ప్రసాద్ రాగానే ఇంట్లో అందరూ వైష్ణవి వాళ్ళ మేనత్త గారి ఊరు గూడూరుకు వెళ్ళారు. పండు రిక్షాలోనో ఆటోలోనో వెళ్లాలని సరదా పడ్డాడు కాని, అలా వీల్లేదు కారులోనే వెళ్ళాలనడంతో అయిష్టంగానే ఒప్పుకున్నాడు. ఆ రాత్రి భోజనాలు అయ్యాక

"నాన్నమ్మా, మీ ఇంట్లో మొగుడి రేకులు రావా?" అడిగాడు పండు.

దొడ్లో చాలా పూలున్నాయి నాయనా. ఇప్పుడు పొద్దు పోయిందిగా రేపుదయన్నే కోసుకుందుర్లే" చెప్పింది వైష్ణవి వాళ్ళ మేనత్త.

"పూలు కాదు నాన్నమ్మా టివిలో చూస్తామే ఆ 'మొగుడి రేకులు'" ఆవిడకు అర్థం అయ్యేలా వివరించాడు పండు.

"ఓ మొగలి రేకులా!" అని అమ్మమ్మ అనగానే అందరూ ఒకటే నవ్వడం. ఈ పెద్దవాళ్ళకు చిన్నవాళ్ళను చూస్తే ఎందుకంత నవ్వొస్తుందో అస్సలర్థం కాదు పండుకు.

మరుసటి రోజు మధ్యాహ్నం వైష్ణవి వాళ్ళ మేనత్త, వైష్ణవి, అమ్మమ్మ బంగారు అంగడికి వెళ్తూ పండును కూడా తీసుకుని వెళ్ళారు. వాళ్ళకు నచ్చిన గాజులను చూసి వాటి ఖరీదెంతో చెప్పమని అడిగారు. ఆ కొట్టతను వాటిని తూకం వేసి నలభై ఆరు వేలని చెప్పాడు.

"ఇచ్చే రేటు చెప్పండి. నిన్నవీటిని మేం నలభై వేలకే కొన్నాం" అని పండు అనగానే అక్కడున్న వాళ్ళందరూ ఒకటే నవ్వడం.

ఆ కొట్టతను నవ్వుతూ "నీకయితే ఐదు వేలకే ఇస్తాను బాబూ" అని పండు వెళ్ళేప్పుడు ఓ వెండి ఉంగరం వేలికి తొడిగి పంపించాడు.

*　　　*　　　*　　　*　　　*　　　*

ప్రసాద్ వాళ్ళ సొంతూరు ఉప్పలపాడు. అది గూడూరుకు పది కిలోమీటర్ల దూరంలో వుంది. అక్కడ ప్రస్తుతం ప్రసాద్ వాళ్ళ బాబాయి ఉంటున్నారు. ఉదయాన్నే గూడూరులో టిఫిన్ చేసి అందరూ ఉప్పలపాడుకు బయలుదేరి వెళ్ళారు. అదో చిన్న పల్లెటూరు. మొత్తం వెయ్యి గడపలు ఉన్నాయేమో. నాగరికత పోకడలు పెద్దగా పొక్కని ఊరు.

ఊరి చివర వున్న గుడిసెలు చూసి "తాతయ్యా, మనం కూడా అలా కేంపింగ్ చేద్దామా?" అని అడిగాడు పండు. "అవి కాంప్ సైట్స్ కావు పండూ, వాళ్ళు ఆ ఇళ్ళలోనే ఉంటారు" అని తాతయ్య చెప్పినా వాడికి నమ్మకం కలగలేదు. అంత చిన్న ఇంట్లో ఉండడం అసాధ్యం అనే వాడి భావన. అక్కడే మట్టిలో రెండు తాటి బుర్రలను ఒక కర్రకు కట్టి మరో కర్రతో నెట్టుకుంటున్న చిన్న పాపను, ఆ పక్కనే సైకిల్ టైర్ ను పుల్లతో నెడుతూ పరిగెడుతున్న పిల్లవాణ్ణి చెట్టు మీద గోలగోలగా అరుస్తున్న కాకులను చూసి "హౌ లక్కీ" అనుకుని కనిపించినంత దూరం వాళ్ళను చూస్తూనే ఉన్నాడు పండు.

ప్రసాద్ వాళ్ళ బాబాయి వాళ్ళ ఇంటి దగ్గర కారు దిగ్గానే, ఇంటి ప్రహరీ గోడ పక్కగా మట్టిలో గింజలు తింటున్న కోడి వెంట పడ్డాడు పండు. వాళ్ళ బాబాయి "ఒరేయ్ అది మన కోడి కాదురా పక్కింటి వాళ్ళది" అని పండును లోపలకు తీసుకుని వెళ్ళాడు. గేటు దాటగానే ఇంటి ముందు కట్టేసిన గేదెల్ని, ఎద్దుల్ని చూసి పండు చాలా సరదా పడ్డాడు. ఆ గేదె మీద తనని కూర్చోబెట్టమని ప్రసాద్ దగ్గర మారాం చేసి మారీ గేదె మీదెక్కి కూర్చున్నాడు. ఇంటి ముందే మరో మూలనున్న బావిలోంచి చేదతో నీళ్ళు తోడాడు. కట్టెలతో మండుతున్న పొయ్యిని మోకాళ్ళ మీద వంగి ఆశ్చర్యంగా చూసాడు.

పెరట్లో తిరుగుతున్న బాతుపిల్లల్ని అరచేతిలో పెట్టుకుని ముద్దుచేస్తూ అక్కడ ఉన్నంత సేపూ వాటితోనే ఆటలు. ఇంటికి వెళ్ళే సమయానికి వాటిని కూడా తీసుకెళ్లాలని గొడవ పెట్టాడు. ఇప్పుడు కాదులేరా ఇంకో పదిరోజులకు ఇంకా పిల్లలు వస్తాయి అప్పుడు తెచ్చి ఇస్తానని బాబాయి వాగ్దానం చేసాక ఇంటికి బయలుదేరాడు. బాబాయి, సపోటాల బుట్ట, ఓ రెండు డజన్ల జామకాయలు, కూరగాయల విత్తనాలు, ఎండిపోయిన బంతి పువ్వులు అన్నీ మూట కట్టి కారులో పెట్టించాడు. తరువాత ప్రతిరోజూ ప్రసాద్ ని వాళ్ళ బాబాయికి ఫోన్ చెయ్యమని బాతులు గురించి గుర్తు చేస్తూనే ఉన్నాడు. బాబాయి ఇచ్చిన మాట ప్రకారం పది రోజుల తరువాత ఓ మూడు బాతులను తెచ్చిచ్చాడు. అమ్మమ్మ “ఈ టౌన్ లో బాతులను ఎలా పెంచుదాం” అని గొడవ పెట్టినా తాతయ్య మాత్రం పండు అమెరికా వెళ్ళినా తనా బాతులను జాగ్రత్తగా చూసుకుంటానని మాటిచ్చాడు.

*    *    *    *    *    *

ఓ రోజు సాయంత్రం తాతయ్య, అయన స్నేహితుడు నారాయణ మూర్తి మాట్లాడుకుంటూ మధ్య గదిలో కూర్చున్నారు. మాటల మధ్యలో నారాయణ మూర్తి తమ పక్కింటి వారి చిన్న పాపకు డెంగ్యు ఫీవర్ వచ్చిందని, ప్రస్తుతం ఆ పాప హాస్పిటల్ లో ఉందని చెప్పాడు. ఆరునెలల క్రితమే ఆ వీధిలో ఓ ముప్పై ఏళ్ళ వ్యక్తి అదే జ్వరంతో చనిపోయిన విషయం గుర్తుతెచ్చుకుని వాళ్ళిద్దరూ  చాలా బాధ పడ్డారు.

ఆ పక్కనే కూర్చుని ఆడుకుంటున్న పండు తాతయ్య దగ్గరకు వచ్చి "దోమలు కుట్టేప్పుడు వాటికి మ్యూజిక్ ఎందుకు తాతయ్యా సైలెంట్ గా కుట్టొచ్చుగా " కాలిమీద ఎర్రగా కందిన భాగాన్ని చూస్తూ అడిగాడు పండు.

"మేం చిన్నతనాన్నుండి దోమలతో కుట్టించుకుంటున్నాం గాని పండూ, మాకీ సందేహం ఎప్పుడూ రాలేదురా" అని భళ్ళున నవ్వాడు నారాయణ మూర్తి.

"అసలు ఇండియా ఫ్లాగ్ లో వీల్ ఉంటుంది కదా తాతయ్యా, ఆ వీల్ మధ్యలో దోమ బొమ్మ పెట్టాలి. చుట్టూ యారోస్ అన్నీ దోమ వైపు పాయింట్ చెయ్యాలి. ఇండియాలో ఆర్మీ, పోలీస్ ఇంకా ఇండియాలో మనుషులందరూ దోమల్ని చంపడానికే ఎఫర్ట్స్ పెట్టాలి"అంటూ కందిపోయిన భాగమ్మీద గట్టిగా రుద్దుకుంటూ కొంచెం ఆవేశంగా చెప్పాడు పండు.

"ఈ రోజున ఇండియాలో దోమ కాటు వలన ఎన్నెన్ని జబ్బులు, జ్వరాలు వస్తున్నాయో,  ఎంత మంది మనుషులు రాలిపోతున్నారో లెక్కే లేదు. చిన్నవాడివైనా బాగా చెప్పావు పండూ. దోమలు లేకుండా వుండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. అలా ఉండాలంటే ప్రజలలో అవేర్ నెస్ రావాలి. రోడ్లు చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉండాలి. ఎక్కడా మురుగు నీరు నిలువకుండా చూడాలి. ఇవన్నీ చేయగలిగితే మన దేశం సగం బాగు పడ్డట్లే. నీ కోరిక ప్రకారం అలా జరుగుతుందనే ఆశిద్దాం పండూ" సుదీర్ఘంగా చెప్పాడు తాతయ్య.

(వచ్చేనెలలో బుజ్జిపండు ఏం కబుర్లు చెబుతాడో..ఎదురు చూస్తుందాం..)

●●●

రచయిత్రి బ్లాగు : http://themmera.blogspot.com/

Click here to share your comments on this story